## క్లుప్తంగా

### ఈదురుగాలులకు దెబ్బతిన్న అరటి పంట



గొల్లపేట సమీపంలో దెబ్బతిన్న అరటిపంట

పూసపాటిరేగ: మండల కేంద్రమైన పూసపాటి రేగలో మంగళవారం అర్ధరాత్రి సమయంలో కురిసిన ఈదురుగాలుల వర్షానికి అరటి పంట తీవ్రంగా దెబ్బతింది. పూసపాటిరేగ గొల్లపేట సమీపంలో మహంతి ఆదినారాయనకు చెందిన సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో అరటి పంట నాశనమైంది. అలాగే కొప్పెర్ల, కుమిలి గ్రామాల్లో కూడా అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. లక్షల రూపాయల విలువైన అరటి పంట నాశనమవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

### ఏపీటీఏఎస్ఏ రాష్ట్ర కోశాధికారిగా యుగంధర్



యుగంధర్‌ను అభినందిస్తున్న జిల్లా ట్రెజరీ ఉద్యోగులు

విజయనగరం అర్బన్: విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఇటీవల జరిగిన ట్రెజరీ ఉద్యోగుల రాష్ట్ర (ఏపీటీఏఎస్ఏ) కమిటీ ఎన్నికల్లో సంఘ రాష్ట్ర కోశాధికారిగా పట్టణానికి చెందిన ఎల్‌వీ యుగంధర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో యుగంధర్‌ను జిల్లా కమిటీ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆదినారాయణ, జిల్లా కార్యదర్శి పీఎస్ కిరణ్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### బాలికలకు అవగాహన కల్పించండి




కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏసీడీపీఓ తవిటినాయుడు

విజయనగరం ఫోర్ట్: కిశోర బాలికల్లో వచ్చే శారీరక మార్పులపై వారికి అవగాహన కల్పించాలని విజయనగరం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఏసీడీపీఓ బి. తవిటినాయుడు తెలిపారు. బుధవారం స్థానిక ఆనంద గజపతి ఆడిటోరియంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చనే విషయాన్ని బాలికలకు తెలియజేయాలన్నారు. చిన్న వయసులో గర్భం దాల్చడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నమవుతాయని తెలిపారు. కార్యక్రమంలో టీపీఆర్ఓ ఓ. సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

# 30 రోజుల్లో రూ.11.29 కోట్లు..

- ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపులకు స్పందన
- గతేడాదికన్నా రూ.4 కోట్లు అదనం



నగరంలోని భవన సముదాయాలు

విజయనగరం: మున్సిపాలిటీల్లో ముందస్తు ఆస్తి పన్ను చెల్లింపులకు ప్రజల నుంచి స్పందన లభించింది. నూతన ఆర్థిక సంవత్సరంలో మొదటి నెల రోజుల్లో సంవత్సర కాలపు పన్ను మొత్తం చెల్లించే వారికి ఐదు శాతం రాయితీ కల్పించడంతో ఇంటి యజమానులు ముందుకొచ్చి చెల్లించారు. ప్రతి ఏడాదీ ఏప్రిల్ నెలలో ముందుస్తుగా పన్ను చెల్లించే వారికి రాయితీ సౌకర్యం మున్సిపల్ శాఖ కల్పిస్తుండగా...

ఈ ఏడాది విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అధికారిక లెక్కల ప్రకారం 17,449 మంది భవన యజమానులు రూ.11.29 కోట్లు చెల్లించారు. చివరి రోజైన బుధవారం ఒక్క రోజే రూ.70 లక్షలకు పైగా పన్నుల రూపంలో ఖజానాలో జమ కావటం విశేషం. 2024 – 25 ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది అదనంగా రూ.4 కోట్లు వసూలు చేశారు. గతేడాది 11 వేల మంది రూ.7 కోట్లు మొత్తం చెల్లించినట్లు అధికారులు చెబుతున్నారు.

**ఆస్తి పన్ను ముఖ్యం..**

వాస్తవానికి కార్పొరేషన్ ప్రధాన ఆదాయ వనరుల్లో ఆస్తి పన్ను ముఖ్యమైంది. దీంతో బకాయిల్లేకుండా వసూలు చేయడం యంత్రాంగానికి తలనొప్పిగా మారింది. ఏడాది చివరలో హడావిడి చేసి వసూలు చేయడం తప్ప ఇతర సమయాల్లో వసూళ్లపై పెద్దగా దృష్టి సారించడ లేదు. దీంతో బకాయిలు రూ.కోట్లల్లో పేరుకుపోతున్నాయి. గతేడాది వంద శాతం వసూలు చేయాలని ప్రభుత్వం లక్ష్యం విధించినా ఒక్కో మున్సిపాలిటీ 50 శాతం నుంచి 80 శాతం లోపే పన్నులు రాబట్టాయి. ఈ నేపథ్యంలో ముందస్తుగా పన్ను చెల్లిస్తే ఐదు శాతం రాయితీ కల్పించే విధానంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎలాంటి బకాయిలు లేని వారు ఏప్రిల్ 30 లోపు 2025 – 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్ను ముందస్తుగా చెల్లిస్తే వారికి 5 శాతం రాయితీ కల్పించడంతో ప్రజల నుంచి స్పందన లభించింది.

## విజయ్‌కుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

- ఎమ్మెల్సీలు సురేష్‌బాబు, గాదె శ్రీనివాసులనాయుడు

నెల్లిమర్ల: విద్యారంగానికే కాకుండా కళారంగానికి విజయ్‌కుమార్ ఎనలేని సేవలందించారని.. అటువంటి వ్యక్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీలు డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు (సురేష్‌బాబు), గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. విజయ్‌కుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా జరజాపుపేటలో బుధవారం సత్కార సభ ఏర్పాటు చేసశారు. ఎంఈఓ ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్సీలు మాట్లాడుతూ.. ఐదు దశాబ్దాలుగా ఎంతో మంది విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత విజయ్‌కుమార్‌కు దక్కుతుందని చెప్పారు. అలాగే నాటక రంగంలో నంది సహా ఎన్నో అవార్డులను అందుకున్నారని కొనియాడారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, డీఈఓ మాణిక్యంనాయుడు, డిప్యూటీ డీఈఓలు వెంకటరమణ, మోహనరావు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సత్యం, రాము, శ్రీనివాసరావు, ఈశ్వరరావు, త్రినాథ్, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనలో భాగస్వాములు కావాలి



రామతీర్థంలో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేస్తున్న అర్చకులు, ఎన్‌జీఓ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్:

బాల్య వివాహాల నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని వైసీబీ స్వచ్ఛంద సంస్థ పీడీ ప్రసాదరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో భక్తులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్షయ తృతీయ సందర్భంగా చాలా ప్రాంతాల్లో సామూహిక వివాహాలు జరిగే అవకాశం ఉందన్నారు. ఇదే క్రమంలో బాల్య వివాహాలు కూడా జరిగే అవకాశం లేకపోలేదన్నారు. ఆలయాల ప్రతినిధులు బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, చట్టాన్ని అనుసరించి అడుగులు వేయాలని సూచించారు. అనంతరం బాల్య వివాహాలకు వ్యతిరేకంగా అర్చకులు, భక్తులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సిబ్బంది ఝాన్సీ రాణి, నారాయణమ్మ, అప్పారావు, అర్చకులు నరసింహాచార్యులు, కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

### వాటర్ ట్యాంక్‌లు పరిశుభ్రం

విజయనగరం: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంలో భాగంగా నగరంలోని పలు వాటర్ ట్యాంక్‌లను కార్పొరేషన్ సిబ్బంది శుభ్రం చేశారు. కార్పొరేషన్ కమిషనర్ ఆదేశాలతో పలు ప్రాంతాలలో ఉన్న వాటర్ ట్యాంకులను శుభ్రపరిచే కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే సచివాలయాల పరిధిలో ఎమినిటీస్ కార్యదర్శులు ఎప్పటికప్పుడు నీటి నాణ్యత పరీక్షలను చేపడుతున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. ప్రతి 15 రోజులకోసారి అన్ని వాటర్ ట్యాంకులను పరిశుభ్రపరచాలని ఇదివరకే సిబ్బందినిన ఆదేశించామన్నారు.

### సమ్మె విజయవంతం చేయండి

విజయనగరం గంటస్తంభం: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె. సుబ్బరావమ్మ పిలుపునిచ్చారు. నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు. అనంతరం సమ్మెకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు టీవీ.రమణ, ఎ.జగన్ మోహనరావు, వి.లక్ష్మి, బి.సూర్యనారాయణ, ఎ.గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

### పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే ఉపేక్షించం

విజయనగరం క్రైమ్: పేకాట, కోడిపందాలు నిర్వహిస్తే ఉపేక్షించమని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. విజయనగరం అయ్యన్నపేటలో ఓ విశ్రాంతి భవనంలో పేకాటాడుతున్న వారిపై వన్‌టౌన్ సీఐ శ్రీనివాస్, క్రైమ్ ఎస్సై సురేంద్ర నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం దాడులు చేపట్టారన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నాలుగు నెలల వ్యవధిలో పేకాటాడుతున్న 522 మందిపై కేసులు నమోదు చేసి రూ. 17 లక్షల నగదు సీజ్ చేశామన్నారు. అలాగే కోడి పందాలు ఆడుతున్న 145 మందిపై కేసులు నమోదు చేసి 65 కోడిపుంజులు, లక్షా 16 వేల నగదు స్వాధీనం చేసుకున్నారని చెప్పారు. ఎక్కడ అసాంఘిక కార్యక్రమాలు జరిగినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.



**దుస్తుల పంపిణీ..**

వనితా వాకర్స్ క్లబ్ ఫోర్ట్ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక దినోత్సవం నేపథ్యంలో స్థానిక కోట జంక్షన్‌లో రిక్ష కార్మికులకు తువ్వాళ్లు, కూరగాయలు విక్రయిస్తే మహిళల, పారిశుధ్య కార్మికులకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ డిప్యూటీ గవర్నర్ ముల్లపూడి సుభద్రాదేవి మాట్లాడుతూ.. సమాజం కోసం నిరంతరం కష్టించి పనిచేసే కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.అచ్చిరెడ్డి, వాకర్స్ క్లబ్ పూర్వపు గవర్నర్ కొత్తలి ఎర్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.
– విజయనగరం



**నగరంలో కమిషనర్ పర్యటన**

క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య 43వ డివిజన్‌లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా పారిశుధ్య పనులను పరిశీలించారు. పేరుకుపోయిన చెత్తకుప్పలను తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం 52వ నంబర్ సచివాలయాన్ని సందర్శించి, రికార్డులను పరిశీలించారు. పౌరసేవలు ఎలా అందిస్తున్నదీ ఆరా తీశారు. ప్రజలు కూడా కాలువలో చెత్తాచెదారాలు వేయకుండా డస్ట్‌బిన్‌లను వినియోగించాలని సూచించారు.
– విజయనగరం



**వేసవి శిక్షణ తరగతులు..**

డెంకాడ మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో విభిన్న అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం జరిగిన శిక్షణ తరగతుల్లో విద్యార్థులు బొమ్మలు వేశారు. అలాగే తెలుగు పద్యాలు పాడి అలరించారు. అనంతం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు లైబ్రేరియన్ వై.మహేష్ బహుమతులు అందజేశారు.
– డెంకాడ



**వార్షికోత్సవం**

పట్టణంలోని మహారాజా అటానమస్ కళాశాల వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ముఖ్య అతిథిగా హాజరైన గరివిడి ఫ్యాక్టరీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎంఎస్ఎస్ శర్మ మాట్లాడుతూ.. సాంకేతిక రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా అధునాతన పద్ధతులలో బోధన అందించాలని సూచించారు. కార్యక్రమంలో మాన్సాస్ విద్యాసంస్థల కరస్పాండెంట్ కేవీఎల్ రాజు, ప్రిన్సిపాల్ ఎం.సాంబశివరావు, ఎస్ఎంఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర బీఎస్ఎన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.
– విజయనగరం అర్బన్

# ఆర్థిక సాయం కోసం ఎదురు చూపులు..!

- ఆటో డ్రైవర్లకు ఏటా రూ.15వేలు ఆర్థిక సాయం చేస్తామని హామీ ఇచ్చిన కూటమి
- కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అమలు కాని పథకం
- వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేల సాయం అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం



కోమటిపల్లి కూడలిలోని ఆటో స్టాండ్

దత్తిరాజేరు: అధికారం కోసం బూటకపు హామీలు ఇవ్వడం... ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించడం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదనడంలో అతిశ యోక్తి కాదు. ఎన్నికలకు ముందు ఒక మాట, తర్వాత మరో మాట చెప్పడం, వర్గాల వారీగా ప్రజలకు హామీ లు ఇచ్చి ఆకట్టుకోవడం...అధికారం చేజిక్కిన తర్వాత వాటిని అటకెక్కించడంలో ఆయనకు సాటి మరెవ్వ రూ రారని ప్రజలు చర్చించుకుంటున్నారు. చంద్రబాబు చెప్పిన మాయమాటలకు అన్ని వర్గాల ప్రజల మాదిరిగానే తాము మోస పోయా మని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో,ట్యాక్సీ, లైసెన్స్ కలిగిన లారీ, ట్రిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15 వేల ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద బీమా, ఆరోగ్యబీమా కల్పిస్తామని, డ్రైవర్ల పిల్లలకు విద్యారుణాలు ఇప్పిస్తామని కూటమి ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొంది. ఎన్నికల సమయంలో కూటమి నాయకు లు వీటిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఈ హామీలు ఏవీ కార్యరూపం దాల్చ లేదు. ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయమైనా అందించాలని ఆటో డ్రైవర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గజపతినగరం నియోజకవర్గంలోని దత్తిరాజేరు, గజపతినగరం, బొండపల్లి, గంట్యాడ మండలాల్లో సుమారు 600 మంది వరకు ఆటోలు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. వీరంతా ప్రభుత్వం ఎప్పుడు ఆర్థికసాయం చేస్తుందా అని ఎదురు చూస్తున్నారు.

**వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో భరోసా**

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.10 వేల సాయం అందించేది. అలాగే ప్రమాదవశాత్తు డ్రైవర్లు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10లక్షలు బీమా అందించే వారు .అలాగే వాహనాల కొనుగోళ్లకు రూ.3 లక్షల వరకు వడ్డీ రాయితీతో బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పించే వారు. ప్రభుత్వం అందించిన రూ.10 వేల ఆర్థిక సహాయం ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ వంటి అవసరాలకు ఉపయోగపడేవి.

**మాట నిలబెట్టుకోవాలి**



ఆటో డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తామని 2019 ఎన్నికలకు ముందు పాదయాత్రలో జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హహన మిత్ర పథకం పేరిట ఏటా ఆర్థిక సహాయం అందించారు. జగన్‌మోహన్‌రెడ్డిలా సీఎం చంద్రబాబు కూడా మాట నిలబెట్టుకోవాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదిరిగానే కూటమి ప్రభుత్వం కూడా ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలి.
– శీర లక్షణ ఆటో డ్రైవర్, కోమటిపల్లి

**రూ.15 వేలు ఇవ్వాల్సిందే..**



రోజంతా కష్టపడి ఆటో నడిపినా రూ.300 నుంచి రూ.400 మిగలడం లేదు. కుటుంబ పోషణ కష్టంగా మారింది. పెరిగిన బీమా ప్రీమియం ,రోడ్డు ట్యాక్స్ కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నికల హామీ మేరకు కూటమి ప్రభుత్వం ఆటో కార్మికులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఇవ్వాల్సిందే.
ఏ.రాంబాబు, ఆటో డ్రైవర్, దత్తిరాజేరు ఆటో స్టాండ్

# శ్రమైక జీవనం



ఎంత ఎత్తయినా ఎక్కించేద్దాం.. రామానాయుడు రోడ్డులో గోనెలను లోడ్ చేస్తున్న కార్మికులు

శ్రామికులకు శ్రమే ఆయుధం.. పెట్టుబడి. ఉదయం నుంచి పొద్దుపోయేవరకు పనిలో నిమగ్నమవుతారు. శ్రమనే ఇంధనంగా మార్చి బతుకుబండిని లాగుతారు. శ్రమైక జీవన సౌందర్యాన్ని చాటుతారు. కార్మిక దినోత్సవం (మే 1) సందర్భంగా విజయనగరం పట్టణంలో శ్రమజీవుల చిత్రాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.
– సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం



ఎండైనా 'బతుకుబండి'ని లాగాల్సిందే..



బియ్యం బస్తాలు దించుతున్న కార్మికులు



ట్రాలీపై సాగిపోదాం..



సాగిపోదాం అలా..